క్లుప్తంగా

నేడు పొంగులేటి ఆధ్వర్యాన ఇఫ్తార్ విందు

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన బుధవారం సాయంత్రం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. నగరంలోని మమత ఆస్పత్రి మెయిన్ రోడ్డులో హార్వెస్ట్ స్కూల్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఈ విందు ఏర్పాటుచేయగా, నగరంతో పాటు రఘునాథపాలెం మండలానికి చెందిన ముస్లిం హాజరుకావాలని మాజీ ఎంపీ క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి కోరారు.

రేపు స్థాయీ సంఘాల సమావేశం

ఖమ్మం సహకారనగర్: జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం ఈ నెల 20వ తేదీన జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ వీవీ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. 2వ గ్రామీణాభివృద్ధి స్థాయీ సంఘాల సమావేశం ఉదయం 10.30గంటలకు, 4వ కమిటీ విద్య, వైద్యం ఉదయం 11.30గంటలకు, 1,7వ కమిటీలు ఆర్థిక, ప్రణాళిక మధ్యాహ్నం 12.30గంటలకు, 3వ వ్యవసాయం కమిటీ సాయంత్రం 2.30గంటలకు, 5వ మహిళా సంక్షేమం సాయంత్రం 3.30గంటలకు, 6వ సాంఘిక సంక్షేమం సాయంత్రం 4.30గంటలకు నిర్వహించబడుతున్నారు. సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఎంపీడీఓకు జేపీఎస్‌ల సమ్మె నోటీస్



ఎంపీడీఓకు నోటీస్ ఇస్తున్న కార్యదర్శులు

నేలకొండపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శు(జేపీఎస్)ల సర్వీస్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు ఇతర డిమాండ్లతో ఈనెల 28 నుంచి సమ్మెకు దిగుతున్నట్లు సంఘం బాధ్యుడు బైరం దినేష్‌కుమార్ తెలిపారు. ఈమేరకు మంగళవారం ఎంపీడీఓ జమలారెడ్డికి సమ్మె నోటీస్‌లు ఇచ్చాక ఆయన మాట్లాడారు. జేపీఎస్‌లు, ఔట్ సోర్సింగ్ కార్యదర్శుల సమస్యలపై సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవేందర్, బోళ్ల వీరబాబు, సత్యనారాయణ, నరేష్, కోటేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

ఖమ్మంఅర్బన్: నగరంలోని పలు ప్రాంతాల్లో నిరుపేదలకు మాతృభూమి సేవా సొసైటీ, శ్రీవాసవీ మహిళాస్వచ్ఛంద సేవా గ్రూప్ సభ్యులు ఉయ్యూరు విష్ణుబాబు వర్ధంతి సందర్భంగా మంగళవారం అన్నదానం చేశారు. ఈసందర్భంగా సుమారు 80 కుటుంబాలకు అన్నదానం చేసినట్లు వారు తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు రామకృష్ణతో పాటు నవ్య, పుష్ప, సంధ్య, స్వాతి, జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

నియామకం



హరినాథ్‌ను అభినందిస్తున్న రాయల

కూసుమంచి: కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం (ఎన్‌ఎస్‌యూఐ) జిల్లా కార్యదర్శిగా మండలంలోని ఎర్రగడ్డతండాకు చెందిన బానోత్ హరినాథ్‌నాయక్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా హరినాథ్‌ను టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావుతో పాటు పలువురు నాయకులు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

పాలేరులో రైతుల పడిగాపులు

కూసుమంచి: మండలంలోని పాలేరులో ఐకేపీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఈనెల 16న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ప్రారంభించారు. కానీ నేటి వరకూ అధికారులు కేంద్రంలో కొనుగోళ్లు చేపట్టలేదు. దీంతో రైతులు పడిగాపులు పడాల్సి వస్తోంది. కేంద్రం ప్రారంభం కంటే ముందే రైతులు పెద్ద ఎత్తున ధాన్యం తీసుకరాగా కొనుగోళ్లు చేపట్టకపోవటంతో ధాన్యం పొటెత్తింది. రోజుల తరబడి కేంద్రం వద్దనే పడిగాపులు పడుతున్నామని, వెంటనే కొనుగోళ్లు చేపట్టి తమ కష్టాలు తీర్చాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దసరా
వినోద	బలగం
సాయిరాం	రుద్రుడు
ఆదిత్య	శాకుంతలమ్
శ్రీనివాస	రావణాసుర
సుందర్	విడుదల

- ఖమ్మంవ్యవసాయం

రోడ్డు ఇలా.. ప్రయాణించేదెలా?

నరకాన్ని తలపిస్తున్న గుదిమళ్ల రోడ్డు

- ఖమ్మానికి కూతవేటు దూరంలో గ్రామం
- అభివృద్ధికి నోచుకోక ప్రయాణికుల అవస్థలు
- హామీలకే పరిమితమవుతున్న రహదారి
- పట్టించుకోని పాలకులు, అధికారులు



కంకర తేలి అధ్వానంగా మారిన గుదిమళ్ల రోడ్డు

ఖమ్మంరూరల్: ప్రతీ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పాలకులు ఊదరగొట్టు ప్రసంగాలు చేయడం, అనంతరం ఆ హామీలను విస్మరించడం సర్వసాధారణమేనని గుదిమళ్ల వాసులు మండిపడుతున్నారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గుదిమళ్ల గ్రామం.. ప్రకాష్‌నగర్ నుంచి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. కానీ ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే నరకాన్ని తలపించినట్టే. ఒకసారి ప్రయాణిస్తే.. రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి. అంటే రోడ్డు దుస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించకోవచ్చు.

కంకర తేలి, గుంతలు పడి..

గ్రామం నుంచి ఏ అవసరం ఉన్నా.. నిత్యం ఖమ్మం రావాల్సిందే. కానీ రోడ్డు మొత్తం కంకర తేలి పెద్ద పెద్ద గుంతలతో దర్శనమిస్తోంది. వాహనం కదలాలంటే చాలా నెమ్మదిగా వెళ్లాలి. అయినా బాగా కుదుపులకు గురికావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈమార్గంలోనే రైతులు తమ వ్యవసాయ పొలాలకు కూడా ఎరువులు, పంట ఉత్పత్తులు తీసుకొని పోతుంటారు. ఇక వర్షాకాలమైతే నడవటమే కష్టతరం. అయితే ఈ గ్రామానికి వయా వెంకటగిరి నుంచి కూడా వెళ్లొచ్చు.. కానీ పది కిలో మీటర్ల దూరం ఉంటుంది. అంటే అదనంగా ఏడు కిలో మీటర్లు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో వాహనం ఖర్చు, సమయం వృథా తప్ప మరేమీ ఉండదు.

అమలు కానీ హామీలు..

గత ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల నేతలు తమను గెలిపిస్తే తక్షణమే రోడ్డు నిర్మిస్తామని చెప్పి.. అనంతరం ఈ రోడ్డు గురించి పట్టించుకున్న పాపానా పోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. గతంలో కొన్నేళ్లు ఈ గ్రామాన్ని ఖమ్మం నగరంలో విలీనం చేశారు. అనంతరం తిరిగి గ్రామ పంచాయతీగా ఏర్పడింది. కానీ పంచాయతీ పాలక వర్గం ఎన్నిక జరగలేదు. దీంతో ఈరోడ్డు దుస్థితిని అటు ఖమ్మం నగరపాలక సంస్థ కానీ, గతంలో ఉన్న పంచాయతీ పాలకులు కానీ ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఏళ్ల తరబడి బీటీ రోడ్డు నిర్మాణానికి మోక్షం కలగడంలేదు. ఇప్పటికైనా బీటీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుపై నడవకపోతున్నాం..



పొద్దున లేచింది మొదలు రాత్రి వరకు ఈ రోడ్డుపైనే వెళ్లాలి. వ్యవసాయానికి సంబంధించిన ఎరువులు, పంట ఉత్పత్తులు తరలించడం, ఖమ్మం వెళ్లాలన్నా చాలా ఇబ్బందిగా ఉంది. గత 20 ఏళ్ల క్రితం కంకర రోడ్డు వేసి వదిలేశారు. అప్పటి నుంచి ఎవరూ రోడ్డు గురించి పట్టించుకోవడం లేదు. తక్షణమే బీటీ రోడ్డు నిర్మించాలి.

– పటేల్ వెంకటేశ్వర్లు, గుదిమళ్ల

చెప్పినా ఫలితం లేదు..



బీటీ రోడ్డు నిర్మించాలని ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకుండా పోతోంది. ఎన్నికల సమయంలో వస్తారు.. రోడ్డు వేస్తాం అంటారు పోతారు. ఆ తర్వాత పరిస్థితి యథావిధిగా కంకర తేలిన రోడ్డు మాత్రమే దర్శనమిస్తుంది. రైతులు, వాహనదారులు ఈరోడ్డుపై నడవాలంటే నానా అవస్థలు పడుతున్నారు. తమ బాధలను గుర్తించి రోడ్డు వేయాలి.

– రానేరు ఖైదు, గుదిమళ్ల

పాలేరులో బీజేపీ గెలుపు ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ రెడ్డి

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలో బీజేపీ గెలుపును ఏ శక్తి అడ్డుకోలేదని, పార్టీ గెలుపు ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు యడ్ల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆరెగూడెంలో మంగళవారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలేరులో కమ్యూనిస్టులు, బీఆర్ఎస్, కాంగ్రెస్‌ను గెలిపించి మరోమారు మోసపోయేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. బీఆర్ఎస్‌కు ఇవే చివరి ఎన్నికలు కావాలని సూచించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సున్నా రవికుమార్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు చావా కిరణ్‌కుమార్, మండల నాయకులు సున్నా వెంకటేశ్వర్లు, కొమ్మినేని హనుమంతరావు, తన్నీరు శ్రీను, ఇస్లావత్ నాగేశ్వరరావు, మద్దినేని శ్రీను, గోపి, మూర్తి, వీరబాబు, బాలకృష్ణ పాల్గొన్నారు.

బీజేపీ ఆత్మీయ సమ్మేళనం..

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్ర నాయకురాలు ఉప్పల శారద జన్మదినం సందర్భంగా మంగళవారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో త్వరలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ జీ పర్యటన ఉంటుందని తెలిపారు. జాతీయ నాయకత్వం ఖమ్మం వైపు పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టిందని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. అనంతరం ఉప్పల శారదను గల్లా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గెంటెల విద్యాసాగర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సన్నె ఉదయ్‌ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శులు సున్నా రవికుమార్, శ్యాంరాథోడ్, జిల్లా అధికార ప్రతినిధి వీరభద్రప్రసాద్‌తో పాటు డాక్టర్ జి. వెంకటేశ్వర్లు, పసుమర్తి సతీష్, సరస్వతి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



మాట్లాడుతున్న అదనపు పీడీ శిరీష

తిరుమలాయపాలెం: స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టి పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలని డీఆర్‌డీఏ అదనపు పీడీ శిరీష అన్నారు. మూడు రోజుల శిక్షణలో భాగంగా మంగళవారం అవగాహన కల్పించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం జరిగే విధంగా చూడాలని తెలిపారు. అనంతరం తిమ్మక్కపేట గ్రామంలో శిక్షణ బృందం సభ్యులు పర్యటించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాం, ఎంపీఓ రాజేశ్వరి, శిక్షణ నిర్వాహకులు అనూప్, నాగేందర్, ఏపీఓ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు 'కవిత' విద్యార్థులు



అథ్లెట్లను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని ఉపేంద్రయ్యనగర్‌లో గల కవిత డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన విద్యార్థులు జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఫెడరేషన్ కప్ పోటీల్లో ఎస్‌కె.లాల్‌పాషా, డి.దినేష్, కార్తీక్‌లు ప్రతిభ కనబరచడంతో త్వరలో తమిళనాడు రాష్ట్రంలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొననున్నారు. కళాశాల నుంచి ఎంపిక కావటం పట్ల కరస్పాండెంట్ పారుపల్లి ఉషాకిరణ్, ప్రిన్సిపాళ్లు డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ రోజరాణి, అధ్యాపకులు శ్రీనివాసరావు, శరత్‌బాబు, పీడీలు రాజేష్, విజయ్‌లు విజేతలను అభినందించారు.

'త్రివేణి' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని త్రివేణి పాఠశాల ఐఐటీ విద్యార్థులు రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయిలో సుచరిండియా టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబర్చారని పాఠశాల డైరెక్టర్ గొల్లపుడి వీరేంద్ర చౌదరి తెలిపారు. మంగళవారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాలలో అభినందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ప్రిన్సిపాల్ పి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ఐదో తరగతి విద్యార్థి జయదీప్ జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్, 8వ తరగతి విద్యార్థి వెంకటవర్షిద్ ద్వితీయ స్థానం సాధించారన్నారు. కార్యక్రమంలో కృష్ణవేణి–త్రివేణి విద్యాసంస్థల అధిపతి వై.వెంకటేశ్వరరావు, సీఆర్వో మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీయాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న రవికుమార్

కామేపల్లి(కారేపల్లి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వెనుకబడిన వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జిల్లా ఎకాడమిక్ మోనిటరింగ్ అధికారి కె.రవికుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని రామకృష్ణాపురం, ఊట్కూరు ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. పరీక్షల నిర్వహణను పరిశీలించి, మూల్యాంకనం త్వరగా చేపట్టి విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం కిరణ్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

'ఎస్‌బీఐటీ' విద్యార్థులకు ఉద్యోగాలు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో నోసియల్ ఇండియా లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన ప్లేస్‌మెంట్‌లో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రిలు తెలిపారు. మంగళవారం కళాశాలలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించిన సందర్భంగా వారు మాట్లాడారు. మొత్తం 130 మంది విద్యార్థులు డ్రైవ్‌లో పాల్గొనగా.. 36 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో నోసియల్ ఇండియా లిమిటెడ్ ఉపాధ్యక్షుడు రామాన్‌గ్రోవర్, కళాశాల అకాడమిక్ డైరెక్టర్లు శివప్రసాద్, ప్రవీణ్‌కుమార్, సుభాష్‌చంద్రర్, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ..

కూసుమంచి: కూసుమంచి శివాలయం సమీపంలో మంగళవారం ఆటో, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో పల్టీ కొట్టి అందులోని ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా.. కూసుమంచి నుంచి నాను తండా వైపు వెళ్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన బైక్ ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్‌ను తప్పించబోయిన ఆటో పల్టీ కొట్టగా.. అందులోని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి



పన్నుల వసూళ్లను పరిశీలిస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజలు సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి సూచించారు. నగరంలో పన్నుల వసూళ్లను మంగళవారం పరిశీలించిన ఆయన వ్యాపార సముదాయాల యజమానులను కలిసి ఎర్లీ బర్డ్ పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఓజీ.శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, నగరంలోని 4, 5, 6వ డివిజన్లలో పర్యటించిన కమిషనర్ ఆదర్శ సురభి భవన నిర్మాణాల స్థితిగతులు, పైపులైన్ల లీకేజీ మరమ్మతులను పరిశీలించారు. ఈఈ రంజిత్, ఏఈలు హుస్సేన్, నవీన్, సాయిరాం, రమేష్, సర్వేర్ పాల్గొన్నారు.

బాలుడి కుటుంబానికి ఎంపీ పరామర్శ

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయిలో గౌరబోయిన శంకర్, కవిత కుమారుడు జై సోమవారం ఆకస్మాత్తుగా మృతి చెందగా ఎంపీ నామా నాగేశ్వరరావు మంగళవారం పరామర్శించారు. బాలుడి తల్లిదండ్రులకు ఫోన్ చేసిన పరామర్శించిన ఆయన కుటుంబానికి అండగా నిలుస్తానని తెలిపారు.

పులిపాటి కుటుంబానికి..

ఖమ్మంమయూరిసెంటర్: నగరానికి చెందిన డాక్టర్ పులిపాటి ప్రసాద్ తండ్రి నరసింహారావు ఇటీవల మరణించగా ఆయన కుటుంబాన్ని మంగళవారం పలువురు పరామర్శించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, ఉపాధ్యక్షులు మాదిరాజు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి బసవయ్య, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పసుపులేటి శ్రీనివాసరావు, న్యాయవాది తాళ్లూరి దిలీప్‌చౌదరి తదితరులు నరసింహారావు చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడారు.

గణేష్ మృతికి సంతాపం..

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ సీనియర్ సభ్యుడు, శ్రీ రామకృష్ణ విద్యాలయ వ్యవస్థాపక సభ్యుడు శిరం వినాయక హనుమంతరావు (గణేష్) ఇటీవల మరణించగా.. ఆయన సంతాప సభను మంగళవారం నగరంలోని గుట్టల బజార్ శ్రీ రామకృష్ణ విద్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శిరం గణేష్ బీటు బజార్‌లో వ్యాపార సేవలు, గాంధీచౌక్ ఏర్పాటులో ఆయన కుటుంబం అందించిన తోడ్పాటును గుర్తుచేసుకొని సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కడవెండి వేణుగోపాల్, కడవెండి శ్రీనివాస్, అర్వపల్లి అశోక్ కుమార్, శిరం నర్సింహగుప్తా, కృష్ణ ప్రసాద్, బోనాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ మృతి



సంజీవరావు(ఫైల్)

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ సంజీవరావు (63) సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. సంజీవరావు ఖమ్మం ఎక్సైజ్ సీఐగా పనిచేశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈమేరకు ప్రజాపంథా మండల కార్యదర్శి కమ్మకోమటి నాగేశ్వరరావు, రాయల రవికుమార్, సర్పంచ్ నామా ప్రసాద్, నాయకులు ఉపేందర్, యాకూబ్ రావు మృతదేహం వద్ద నివాళులర్పించారు.

అనారోగ్యంతో ఆలయ చైర్మన్..

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరం 3వ డివిజన్ బల్లేపల్లిలోని శ్రీరామాంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ మద్దినేని రవికుమార్(42) మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

త్రైత సిద్ధాంత గ్రంథాల ప్రచారం

ఖమ్మంగాంధీచౌక్: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యాన మంగళవారం ఖమ్మం నగరంలోని వీఆర్‌కే కాలనీలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూజ్ఞాన వేదిక ఖమ్మం నగర కమిటీ ప్రతినిధులు సత్యం, నాగరాజు, ఉమేష్, కాసీం, సంజయ్, సాయి, దీక్షిత్, కృష్ణ, నందకిషోర్, విజయమ్మ, అశ్విని, ఉమ, సుజాత, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

'సైబర్'కు చిక్కి మోసపోవద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రియాంక

ఖమ్మంఅర్బన్: ఆన్‌లైన్ సైబర్ మోసాలకు చిక్కి ఎవరూ మోసపోవద్దని ఖానాపురం హవేలీ ఎస్సై జి.ప్రియాంక సూచించారు. మంగళవారం పోలీస్ శాఖ ఆధ్వర్యాన సైబర్ క్రైమ్ మోసాలపై ఖమ్మం నగరం 2వ డివిజన్ పాండురంగాపురంలో అవగాహన సదస్సు నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. అవసరాల కోసం ఆన్‌లైన్ యాప్‌లో లోన్‌లు తీసుకొని తిరిగి డబ్బులు చెల్లించినా యాప్ నిర్వాహకులు అనేక ఒత్తిళ్లు, బెదిరింపులకు గురిచేస్తారని చెప్పారు. మొబైల్‌కు వచ్చిన ఎలాంటి లింక్‌లకు స్పందించవద్దని, ఓటీపీ చెప్పవద్దని సూచించారు. ఏమైనా మోసం జరినట్లు తెలిస్తే వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930కి ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కేవీఎస్ఎన్ రాజు, లక్ష్మణ్, గంగాధర్, బ్లూకోట్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్లు పంపిణీ



రంజాన్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎండీ అసద్

ఖమ్మం మామిళ్లగూడెం: అవామే ఎహింద్ వెల్ఫేర్ అండ్ చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ హఫీజ్ జవ్వాద్ అహ్మద్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని మసీద్ మక్కాలో 100 మంది నిరుపేద మహిళలకు విద్యావేత్త, న్యాయనిపుణుడు ఎండీ అసద్ చేతుల మీదుగా రెండో దఫా రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో ఎదగాలనుకునే ప్రతి ఒక్కరూ విద్య అవసరాన్ని గుర్తించాలని కోరారు. హఫీజ్ జవ్వాద్ చేస్తున్న సేవలు అభినంద నీయమన్నారు. కార్యక్రమంలో మక్కా మసీదు ప్రెసిడెంట్ షేక్ అలీ, మసీదు ఇమాం సయ్యద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

'కాసా' ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

తిరుమలాయపాలెం: 'కాసా' జాతీయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని మాదిరిపురంలో స్థానిక వనరులు, ప్రత్యేక నిధిపై ప్రజా సంఘాలతో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాసా కోఆర్డినేటర్ ప్రేమ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ. ప్రజా సంఘాలను బలోపేతం చేసి సేవా కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల బాధ్యుతు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కామేపల్లి(కారేపల్లి): 60 ఏళ్లు దాటిన రైతుకు నెలకు రూ.10వేలు పెన్షన్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టాలని రైతు కూలీ సంఘం నాయకులు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పండితాపురం గ్రామంలో ఖమ్మం డివిజన్ స్థాయి నిర్మాణ జనరల్ బాడీ సమావేశం ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మలీదు నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బందెల వెంకయ్యలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలతో రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతు రుణమాఫీ తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ప్రజాపంథా ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఆవుల అశోక్, నాయకులు మంగతాయి, లక్ష్మణ్, రాకేష్, గుమ్మడి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక..

అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా స్వర్ణప్ప, లక్ష్మీనర్సు, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం డివిజన్ కార్యదర్శిగా ధరావత్ లక్ష్మణ్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షుడిగా కూరాకుల నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా కేలోతు పాపారావులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో చల్లా రాజు, దాసు, నాగరాజు, బిరెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

అసలే ఇరుకు గల్లీ.. అందులో చెత్త!



అసలే ఇరుకుగల్లీ..ఆపై చెట్లు కొట్టి నెల దాటుతున్నా మున్సిపల్ సిబ్బంది వాటిని నేటికీ తొలగించనేలేదు. మామిళ్లగూడెంలోని వాసవీ కిరాణం రోడ్డు ఎదురుగా ఉన్న ఇరుకు గల్లీలో చెట్టు కొట్టి అక్కడే పడేశారు. నెల దాటుతున్నా.. వాటిని తొలగించే వారు కరువయ్యారు. దీనికితోడు స్థానికులు కూడా అక్కడే చెత్త వేస్తున్నారు. నిత్యం వచ్చివెళ్లే వందలాదిమందికి ఇబ్బంది కలగకుండా దారిలోని చెట్ల కొమ్మలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

- ఖమ్మం స్పోర్ట్స్

ప్రశ్నించాల్సిన అధికారి : వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్
సెల్ నంబర్ : 79012 98257